
3
అమ్మ జగనా..!


ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 39.0 27.0



ముళ్ల పొదలతో నిండిన గార్లదిన్నె మండలంలో సౌత్‌కెనాల్ కింద ఆయకట్టు కాలువ



శింగనమల మండలం ఈస్టు నరసాపురం గ్రామంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థల సేకరణ చేసిన భూమి



అన్నీ గాలి మాటలే!

చాగల్లు ముంపు బాధితులను ఆదుకోలేదు

- హైడ్రో ప్రాజెక్టు ఊసు మరిచారు
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని విస్మరించారు
- సెంట్రల్ వర్సిటీ అభివృద్ధికి సాయం లేనే లేదు
- ఐదేళ్లు గడిచినా అమలు కాని జగన్ హామీలు

శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి జగన్ ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కూడా వాటి గురించి పట్టించుకోలేదు. ఐదేళ్లు గడిచినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. పైగా ధనార్జనే ధ్యేయంగా ఎమ్మెల్యే పని చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. హామీలు అమలుగాక, సిటింగ్ ఎమ్మెల్యే తీరుకు వ్యతిరేకంగా సొంత పార్టీవారే రోడ్డెక్కడంతో దిక్కుతోచక.. పార్టీ అభ్యర్థిని మార్చుకున్నారు. మాట తప్పి.. మడమ తిప్పి.. ఇప్పుడు ఓట్లెలా అడుగుతారని వైసీపీ అధినేతను, నాయకులను ఇక్కడి జనం నిలదీస్తున్నారు.

- బుక్కరాయసముద్రం

మరమ్మతుల మాటేమిటో!

శింగనమల నియోజకవర్గంలోని రైతులకు ప్రధాన సాగునీటి వనరు మిడ్ పెన్నార్ డ్యాం. దాని కింద ఉన్న సౌత్ కెనాల్ ద్వారా రైతులకు సాగు అందిస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఆయకట్టు కాలువలు శిథిలావస్థకు చేరుకున్నా యి. వీటితో పాటు డ్యాం షట్టర్ గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో నీరు లీకేజీ అవుతున్నాయి. సౌత్ కెనాల్ కింద ఉన్న ఆయకట్ట కాలువలు కంప చెట్లతో నిండిపోయాయి. కాలువలో పూడిక తీయకపోవడంతో దిగువన ఉన్న పంట పొలాలకు సాగు నీరు అందడం లేదు. గత ఐదేళ్లలో హెచ్చెల్సీ మరమ్మతులు, డ్యాం లీకేజీపై పాలకులు, అధికారులు దృష్టిసారించలేదు.

పాఠశాల ఏదీ..?

శింగనమల మండలం ఈస్టు నరసాపురం గ్రామానికి రూ.35 కోట్లతో మహాత్మా జ్యోతి రావ్ పూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అందుకు స్థలం కూడా సేకరించారు. నిధులు మంజూరు కాకపోవడంతో అలాగే వదిలేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్న ఎమ్మెల్యే హామీ అమలు కాలేదు. నార్పలలో బాలికల హైస్కూల్ ఏర్పాటు కోసం కూడా నిధులు మంజూరు కాలేదు.

వంతెనలు ఏవీ..?

నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో వంతెనలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా యల్లనూరు మండలంలో చిత్రావతినదిలో లోలెవల్ కాజ్‌వే నిర్మాణానికి రూ.15 కోట్లు, చింతకాయ మంద కేడీ రోడ్డు, బ్రిడ్జి ఏర్పాటుకు రూ.11 కోట్లు, కోడమూర్తి, చిలమకూరు గ్రామాల మధ్య కాజ్‌వే ఏర్పాటుకు రూ. 15 కోట్ల మంజూరు చేస్తామని నార్పల బహిరంగ సభలో సీఎం జగన్ హామీ ఇచ్చారు. అయితే వాటి కోసం ఒక పైసా కూడా నిధులు మంజూరు కాలేదు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి శింగనమల మండలం సోదనపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. రెండేళ్ల కిందట వర్షాలు రావడంతో శింగనమల చెరువు మూడు నెలల పాటు మరువ పారింది. దీంతో ప్రజలు ఇతర దారుల్లో వెళ్లాల్సి వచ్చింది. ఎమ్మెల్యే సొంత గ్రామానికి వెళ్లాలంటే కూడా ఈదారిగుండానే వెళ్లాల్సి ఉంటుంది. పోతురాజు కాలువ గ్రామానికి చెందిన 40 మంది పేద విద్యార్థులు సోదనపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివే వారు. నీటి ప్రవాహం దాట లేక వారంతా బడి మానేశారు. కాజ్‌వే లేకపోవడం వలన వర్షం వస్తే... ప్రజల రాకపోకలు నిలిచిపోవడంతో దాదాపు 25 కిలోమీటర్లు చుట్టి రావాల్సిన పరిస్థితి ఉందని గ్రామ ప్రజలు వాపోతున్నారు.



గార్లదిన్నె మండలంలో శిథిలావస్థకు చేరిన హెచ్చెల్సీ



జంతులూరు వద్ద మార్కెట్ యార్డు ఏర్పాటు చేయకుండా ఖాళీ బోర్డు దర్శనం ఇస్తున్న దృశ్యం

మార్కెట్‌యార్డు ఎక్కడ?

నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి రైతులకు మరిన్ని సేవ లందిస్తామని సీఎం జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందు కోసం బుక్కరాయసముద్రం మండలం జంతులూరు గ్రామంలో సర్వే నెంబరు 272, 273లో 10 ఎకరాలు భూమిని కేటాయించారు. అయితే అది శంకుస్థాపనకే పరిమితం అయ్యింది. ఎలాంటి నిర్మాణ పనులు జరగలేదు. నియోజకవర్గానికి మార్కెట్ యార్డు కలగానే మిగిలిపోయింది.



ముంపునకు గురైన ఉల్లికల్లు గ్రామం (ఫైల్)

మాట మరిచారు..

చాగల్లు రిజర్వాయర్ కింద ఉన్న ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం విషయంలో తీవ్ర అన్యాయం జరిగింది. గత ఏడాది ఏప్రిల్ 26న నార్పల మండలానికి వచ్చిన సీఎం జగన్ మాట్లాడుతూ చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలైన ఉల్లికల్లు, ఉల్లికుంటపల్లి గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.168 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఏడాది గడిచినా బాధితులకు ఒక్క రూపాయి పరిహారం అందలేదు. పలుమార్లు ఎమ్మెల్యే కూడా హామీ ఇచ్చి ఇటువైపు రావడమే మానేశారని ఆయా గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇవ్వకపోవడంతో మునుగుతున్న గ్రామంలో ఉండలేక వేరే చోటుకు వెళ్లలేక బాధితులు సతమతమవుతున్నారు.

గండికోట నీరు ఏదీ..?

నియోజకవర్గంలోని పుట్లూరు మండలానికి గండికోట రిజర్వాయర్ నుంచి తాగునీటి కోసం రూ.250 కోట్లతో పైపులైన్ పనులను చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. అధికారులు పైపులైన్‌కు సంబంధించిన సర్వే చేసి చేతులు దులుపుకున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి పైపులైను పనులు ప్రారంభం కాలేదు. కనీసం నిధులు మంజూరు చేయలేదు. దీంతో పుట్లూరు మండలంలోని ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ పథకం డీపీఆర్‌కే పరిమితం అయ్యింది.



కుచ్చుటోపీ..

వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుద్యోగులకు ఎలాంటి ఎంప్లాయిమెంట్ కల్పించలేదు. ప్రస్తుతం మేము పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదు. ఎన్నికల ముందు సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, వేతనాలను పెంచాతామని మాట ఇచ్చారు, అయితే ఎక్కడా నిరుద్యోగ సమస్య పరిష్కరించలేదు.

- విష్ణువర్ధన్‌రెడ్డి, కాంట్రాక్టు ఉద్యోగి, నార్పల

ఊసేలేని హైడ్రో ప్రాజెక్టు

రాష్ట్రంలోనే అత్యంత భారీ వ్యయంతో శింగనమల మండలంలోని నాయనివారిపల్లి వద్ద రూ.4500 కోట్లతో హైడ్రో ప్రాజెక్టు నిర్మిస్తామని సీఎం జగన్ ప్రకటించాడు. ఈ ప్రాజెక్టు వస్తే... నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగాలు, పరోక్షంగా పలువురికి ఉపాధి లభిస్తుందని స్థానిక ప్రజలు ఆశించా రు. అయితే ఇదంతా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో పాదయాత్ర సమయంలో ప్రతి మండలంలో నిరుద్యోగులకు ఒక నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నా రు. అయితే ఏళ్ల గడుస్తున్నా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసిందీ లేదు.. ఒక్కరికైనా ఉద్యోగం ఇప్పించిదీలేదు. దీంతో ఇదంతా మోసం గురూ అంటూ నిరుద్యోగులు జగన్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు.



ఎక్కడ ఆదుకున్నారు..?

జగన్ సీఎం అయితే రైతుల ఆశలు నెరవేరుతాయని భావించి ఓటు వేశాం. జగన్ రైతులకు చేసిందీ ఏమీ లేదు. మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కనీసం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేదు. నియోజకవర్గంలోని చెరువులకు నీరు ఇస్తామన్నారు. నీరు ఇవ్వలేదు. కనీసం డ్రిప్, స్ప్రింక్లర్లు కూడా ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

- అప్పయ్య, పెద్దమట్లగొంది, శింగనమల



నరకయాతన..

ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు, కాలువలు లేవు. టీడీపీ హయాంలో వేసిన రోడ్లు మాత్రమే ఉన్నాయి. ఈఐదేండ్లలో ఎక్కడ కూడా చిన్న రోడ్డు, కాలువ వేసింది లేదు. గ్రామాల్లోకి వెళ్లాలంటే గుంతలతో నరకయాతన అనుభవిస్తున్నాం. పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని గ్రామాల్లో అభివృద్ధి కనిపించడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- గుత్తారోజా, కడవకల్లు, పుట్లూరు మండలం

పూర్తి అయ్యేనా..?

గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిపై శీతకన్ను వేసింది. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 2023లో నిర్మాణ పనులు మొదలు పెట్టింది. కనీసం ఈ ఏడాదైన నిర్మాణ పనులు పూర్తి అవుతాయా అని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సెంట్రల్ యూనివర్సిటీ తరగతులను జిల్లా కేంద్రంలో అద్దె గదులలో నిర్వహిస్తున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో వర్సిటీ ప్రహరీ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లోని పలు గ్రామాల్లో నాడు-నేడు పనులు నిధులు లేక నత్తనడకన కొనసాగుతున్నాయి.

భరోసా ఏదీ ?

గత ఎన్నికలకు ముందు, జగన్ పాదయాత్ర సమయంలో నియోజకవర్గంలోని రైతులకు పెద్ద భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు గిట్టుబాట ధర కల్పించే విధంగా తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల గడిచినా ఇప్పటివరకు ఈ హామీ అమలుకు నోచుకోలేదు. రైతులకు గిట్టుబాటు ధర కాదు కదా వారి గురించి ఆలోచన చేసిన పాపానపోలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



కోడమూర్తి-చిలమకూరు గ్రామాల వద్ద నిర్మాణంలో ఉన్న కాజ్‌వే

గూగోడు పట్టించుకోరా !

నియోజకవర్గంలోని గూగూడు, బుక్కరాయసముద్రంలోని దేవరకొండమీద ఉన్న కొండమీదరాయుడి ఆలయాలను అభివృద్ధి చేసి, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పద్మావతి హామీ ఇచ్చారు. అయితే దేవరకొండపైకి టీడీపీ హయాంలో మంజూరు చేసిన బీటీ, సిమెంటు రోడ్డును ప్రారంభించడం తప్ప ఆమె చేసిన అభివృద్ధి ఏమీ లేదు. ఆలయ అభివృద్ధి కమిటీని తొలగించి ఎండోమెంట్ అధికారులకు అప్పగించి అభివృద్ధి నిరోధకురాలిగా మారిందనే విమర్శలు ఆమెపై ఉన్నాయి. గూగుడులో భక్తులను ఇబ్బంది పెట్టే తాగునీటి సమస్యను పరిష్కరించలేకపోయారు.

దుర్మార్గపు పాలనను పెకిలించండి

■ మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఉరవకొండ, ఏప్రిల్ 20: వైసీపీ దుర్మార్గపు పాలనను కూకటి వేళ్లతో పెకలించే సమయం ఆసన్నమైందని మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు, తటస్థుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన పార్టీ టీడీపీ అని అన్నారు. తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా తలెత్తుకునేలా చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నీతివంతమైన పాలన అందించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని అన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. టీడీపీ హయాంలోనే ఎస్సీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారని అన్నారు. అరాచక, ముఠా రాజకీయలకు పాల్పడుతున్న పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపినిచ్చారు. వైసీపీ ప్రభుత్వం సామాన్య ప్రజల జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. ఈ ఐదేళ్లలో సహజవనరులను లూటీ చేశారని, హత్యలు, దౌర్జన్యాలు చేశారని విమర్శించారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి భుజస్కందాలపై ఉందని అన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం దూరదృష్టితో ఆలోచించి, సుపరిపాలన అందించే టీడీపీకి పట్టం కట్టాలని కోరారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి కేశవ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు గుర్రం చెన్నకేశవులు, నాగన్న, ఆదెన్న, గొర్తి శ్రీరాములు, రెడ్డి మాసి సత్యన్న, సోముశేఖర్‌నాయుడు, న్యాయవాది రాజేంద్రప్రసాద్ బాబు, మాజా ఎంపీపీలు నాగేశ్వరరావు, కుళ్లాయప్ప, మాజీ సర్పంచు గోవిందు, నర్రాకేశన్న, పోతుల మల్లికార్జున పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

■ పోస్టల్, హోం ఓంటింగ్‌కు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

అనంతపురం టౌన్: ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల విధులకు హాజరయ్యేవారు ఈ నెల 28 వరకు పోస్టల్ బ్యాలెట్‌కోసం ఫారం-12 దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని ఆర్వోలకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. వారికి మే 3 నుంచి 6వ తేదీ వరకు ఓటు వేసేందుకు నియోజకవర్గ కేంద్రాలలో ఫెసిలిటీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయా రోజులలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయవచ్చని తెలిపారు. రాయదుర్గంలోని కరిబసప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంతకల్లులో సర్వేపల్లి రాధాక్రిష్ణ మున్సిపల్ హైస్కూల్, తాడిపత్రిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శింగనమలవారికి బుక్కరాయసముద్రం ఆర్డీటీ వినికిడిలోపం విద్యార్థుల పాఠశాల, అనంతపురం అర్బన్‌లో ప్రభుత్వ న్యూటౌన్ జూనియర్ కళాశాల, కళ్యాణదుర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాప్తాడు నియోజకవర్గం వారికి పంగల్ రోడ్డులోని టీటీడీసీ సెంటర్‌లో ఫెసిలిటీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

- నడవలేని స్థితిలో ఉన్న 85 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లలోనే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 9,799 మంది ఉండగా 594 మంది, 25,993 మంది దివ్యాంగులు ఉండగా 720 మంది మాత్రమే హోం ఓటింగ్‌కు ఫారం-డి దరఖాస్తు ఇచ్చారని తెలిపారు. ఈ నెల 23 వరకు దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. మే 5 నుంచి 9వ తేదీ వరకు ఇంటివద్దనే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో హోం ఓటింగ్ కోరం మూడు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.
- అత్యవసర శాఖల ఉద్యోగులు పోస్టల్ ఓట్ల కోసం ఫారం-12డి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీరికి మే 8 నుంచి 10వ తేదీ వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని అన్నారు.

వలసలే వలసలు..!

- వైసీపీని వీడుతున్న ముఖ్య నాయకులు
- ఇప్పటికే వందలాదిగా టీడీపీలోకి చేరిక
- అధికార పార్టీలో అలజడి.. టీడీపీలో జోష్..
- దూసుకుపోతున్న పరిటాల కుటుంబం

అనంతపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ టీడీపీలో జోష్ పెరుగుతోంది. వైసీపీ నుంచి వలసలే ఇందుకు ప్రధాన కారణం. ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాల బలమైన సామాజికవర్గం నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరిపోతున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కుటుంబపాలన, ఒంటెద్దు పోకడలతో విసిగివేసారే టీడీపీలో చేరుతున్నామని వారు అంటున్నారు.పార్టీ జెండా మోసినవారికి ప్రాధాన్యం, గుర్తింపు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు లోలోన కుమిలిపోతున్నారు.

వెల్లువలా చేరికలు

రాప్తాడు నియోజకవర్గంలో కురబ, బోయ సామాజికవర్గాలు బలంగా ఉన్నాయి. ఆ తరువాతి స్థానంలో దళితులు, రెడ్డి సామాజికవర్గం ఉంది. అన్ని సామాజికవర్గాల వారు వైసీపీని వీడి.. టీడీపీలో చేరుతున్నారు. దీంతో టీడీపీ బలం నానాటికీ పెరుగుతోంది. వైసీపీ శిబిరంలో అలజడి మొదలైంది. చేరికలను ఆపేందుకు ఆ పార్టీ నేతలు పడరానిపాట్లు పడుతున్నారు. అయినా వలసలు ఆగడం లేదు.

- ఆత్మకూరు మండలంలో అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పోలిరెడ్డి, నారాయణరెడ్డి, రంగారెడ్డి, బోయ లక్ష్మయ్య బోయ తిమ్మరాజు, కురబ తిక్కస్వామి, కురబ నారాయణ, అవిలిగొండ ఈశ్వరయ్య, ఎగ్గడి ఓబుళపతి, కురబ రాము, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నాగన్న, చిన్న అవన్నతో పాటు వందలాది మంది కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.
- అనంతపురం రూరల్ మండలంలో చియ్యేడు సాయినాథరెడ్డి, రాచానపల్లి రమణారెడ్డి, మన్నీల సర్పంచ్ త్రిలోక్‌నాథ్, పాములాయి ఎంపీటీసీ లక్ష్మీ విశ్వనాథ్, తాటిచెర్ల వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, బోయ భజనరాముడు, బోయ రంగయ్య, బోయ రాము, చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ పాములాయి పెద్దన్న, పాములాయి ఉపసర్పంచ్ రజని వెంకటరాముడు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.
- రాప్తాడు మండలంలో మాజీ సర్పంచులు కొత్తపల్లి పెద్దపుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు చాకలి నారాయణస్వామి, బండమీదపల్లి పక్కీరారెడ్డి, ముట్టాల నల్లప్ప, రాప్తాడు మాన్లుకోసే కేశవులు టీడీపీలో చేరారు.
- కనగానపల్లి మండలంలో కనగానపల్లి సర్పంచ్ బియ్యం పరిమల రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్, కురబ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బుల్లే ఈశ్వరయ్య, పాపన్న, అంకె రామచంద్ర, నందమోహన్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎరుకుల వారాధి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, యాతం జయరాములు, పరందామరెడ్డి, పోతులయ్య, రాము, కుంపటి రామన్న, మాజీ ఎంపీటీసీ రమేష్‌లు టీడీపీలో చేరారు.
- చెన్నేకొత్తపల్లి మండలంలో ముత్యాలరెడ్డి, నీలకంఠారెడ్డి, గాలి శివారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాగరాజు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.
- రామగిరి మండలం మాధాపురం ఎంపీటీసీ సంపత్, రాష్ట్ర డైరెక్టర్ నసనకోట సరళా రామాంజనేయులు టీడీపీలో చేరారు. మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో కొందరు, చంద్రబాబు సమక్షంలో మరికొందరు టీడీపీలో చేరారు. తాజా పరిణామాల నేపథ్యంలో వైసీపీ ముఖ్య నేతలు మరికొందరు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

గెలుపే లక్ష్యం

2009లో రాప్తాడు నియోజకవర్గం ఏర్పడింది. ఆ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత విజయం సాధించారు. 2014 ఎన్నికల్లోనూ పరిటాల సునీత గెలుపొందారు. వరుసగా రెండుసార్లు ఆమె రాప్తాడులో గెలుపొందారు. 2019లో జరిగిన ఒక్క చాన్స్ ఎన్నికల గాలివాటంలో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గెలుపొందారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె తనయుడు శ్రీరామ్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రచార వేగాన్ని పెంచారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. ప్రజలను చైతన్యం చేసే దిశగా పరిటాల కుటుంబ సభ్యుల ప్రచారం సాగుతోంది. మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలను ప్రజల్లో ఎండగడుతోంది.

అభివృద్ధే అండగా..

2014 ఎన్నికల్లో రాప్తాడు నుంచి రెండోసారి గెలుపొందిన పరిటాల సునీతకు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కింది. పౌర సరఫరాలు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రిగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. మూడు రిజర్వాయర్లు నిర్మాణం చేపడుతామని చెప్పిన ఎమ్మెల్యే.. శంకుస్థాపనతోనే సరిపెట్టారు. నియోజకవర్గంలో కనీసం రోడ్లకు మరమ్మతులు చేయలేదు. అందుకే.. అభివృద్ధి, సంక్షేమం కావాలంటే టీడీపీని గెలిపించాలని పరిటాల కుటుంబం ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.



మహిళలతో కలిసి.. సూపర్ సిక్స్ పథకాలపై సునీత ప్రచారం



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన కురుబ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ బిల్లే ఈశ్వరయ్య



చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ ఆత్మకూరు మండల ముఖ్య నాయకులు


చంద్రబాబునాయుడుకు వేద పండితుల ఆశీర్వాదం


ముస్లిం మతపెద్దల ప్రార్థన


చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న దగ్గుబాటి

హ్యాపీ బర్త్‌డే బాబూ

శ్రేణులు, చిన్నారుల మధ్య టీడీపీ అధినేత పుట్టినరోజు


చంద్రబాబుకు బొకే ఇస్తున్న బండారు శ్రావణిశ్రీ




చంద్రబాబుకు మామిడి పళ్లు ఇస్తున్న కాలవ


బాబుతో విశ్రాంత ఐపీఎస్ అధికారి కుంటిమద్ది లక్ష్మీనారాయణ


చిన్నారికి కేక్ తినిపిస్తున్న చంద్రబాబు


శుభాకాంక్షలు తెలుపుతున్న పరిటాల సునీత


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎస్ రాజు


ఎన్నికల ప్రచార హడావుడిలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు.. తన పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, శ్రేణులు, చిన్నారుల నడుమ సంతోషంగా జరుపుకున్నారు. ప్రజాగళం సభ కోసం శుక్రవారం రాయదుర్గం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఆయన.. కణేకల్లులో శుక్రవారం రాత్రి బస చేశారు. పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం చంద్రబాబు చేత కేక్ కట్ చేయించారు. పలువురు చిన్నారుల మధ్య చంద్రబాబు కేక్ కట్ చేసి.. వారికి తినిపించారు. అంతకు ముందు సర్వమత ప్రార్థనలను నిర్వహించి, మత పెద్దలు చంద్రబాబును ఆశీర్వదించారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల అభ్యర్థి బండారు శ్రావణి, మడకశిర అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎంఎస్ రాజు, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

- రాయదుర్గం/కణేకల్లు


టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

అభివృద్ధి ప్రణాళిక ఆవిష్కరణ

రాయదుర్గం, ఏప్రిల్ 20: రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికను పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుతో కలిసి టీడీపీ అధినేత చంద్రబాబు కణేకల్లులో శనివారం ఆవిష్కరించారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన 12 పేజీల బ్రోచర్‌ను వారు విడుదల చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో బాధితులు, ప్రజలకు అండగా చేసిన పోరాటాలు, టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను అర్థంతరంగా ఆపేసిన వైనం గురించి కూడా అందులో ప్రస్తావించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అనంతరం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేస్తామో కూడా అందులో వివరించారు.


అభివృద్ధి ప్రణాళికను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు నాయుడు, కాలవ శ్రీనివాసులు

అభ్యర్థుల లెక్కాచారాలు ఇవే..

ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారు నామినేషన్లు సమర్పిస్తున్నారు. దీనికి జతగా అఫిడవిట్ పొందుపరుస్తున్నారు. ఇందులో తమ గురించి పూర్తి సమాచారం అంటే విద్యార్హత, ఆస్తులు, కేసులు వంటివాటి గురించి రిటర్నింగ్ అధికారులకు ఇస్తున్నారు. అవి నియోజకవర్గాల వారిగా ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం: ధర్మవరం

పేరు:కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
పార్టీ: వైఎస్ఆర్ కాంగ్రెస్
భార్య పేరు: సుప్రియ
విద్యార్హత: బీ.ఈ
స్థిరాస్తులు: రూ.50,43,400
చరాస్తులు: రూ.4,24,89,880
నగదు: రూ.10.52లక్షలు
వాహనం విలువ: రూ.12.85లక్షలు
బంగారం: 215 తులాలు
అప్పులు: 1,59,65,481
కేసులు: 0

నియోజకవర్గం: ఉరవకొండ

పేరు: ప్రణయ్‌కుమార్‌రెడ్డి
పార్టీ: వైఎస్ఆర్ కాంగ్రెస్
విద్యార్హత: బీటెక్(డిస్ కంటిన్యూ)
కేసులు: 2 క్రిమినల్ కేసులు
చరాస్తుల విలువ: రూ.1.12కోట్లు
స్థిరాస్తి విలువ: రూ.1.03కోట్లు
అప్పులు: రూ.12.35లక్షలు
బంగారం: లేదు

పేరు: పయ్యావుల కేశవ్
పార్టీ: తెలుగుదేశం
విద్యార్హత: పీజీ
కేసులు: 1 క్రిమినల్ కేసు
చరాస్తులు: రూ.3.21 కోట్లు
స్థిరాస్తి: రూ.1.75 కోట్లు
అప్పులు: రూ.3.35 కోట్లు
బంగారం: లేదు

పేరు: వై.మధుసూదన్‌రెడ్డి
పార్టీ: కాంగ్రెస్
విద్యార్హత: డిగ్రీ (బీకాం)
కేసులు: 3 క్రిమినల్ కేసులు
చరాస్తులు: రూ.8.07లక్షలు
స్థిరాస్తి: రూ.81.30లక్షలు
బంగారం: లేదు
అప్పులు: రూ.21.54లక్షలు

నియోజకవర్గం: గుంతకల్లు

పేరు: వై. వెంకట్రామిరెడ్డి
పార్టీ: వైఎస్ఆర్ కాంగ్రెస్
విద్యార్హత: బీకాం
కేసులు: 4
చరాస్తులు: రూ. 2.20 కోట్లు
స్థిరాస్తి: రూ. 2.28 కోట్లు
బంగారం: 1350 గ్రా.

పేరు: కమర్‌బేగం
పార్టీ: ఇండిపెండెంట్
విద్యార్హత: ఎల్ఎల్‌బీ
కేసులు: లేవు
చరాస్తులు: రూ.36 లక్షలు
స్థిరాస్తులు: రూ.4.20 కోట్లు
బంగారం: 200 గ్రా.

నియోజకవర్గం: రాప్తాడు

పేరు: పరిటాల శ్రీరామ్
పార్టీ : తెలుగుదేశం
విద్యార్హత: డిప్లొమా ఇన్ ఇంటర్‌నేషనల్ బిజినెస్
కేసులు: 22
స్థిరాస్తి: రూ.6.03 కోట్లు
చరాస్తి: రూ. 1.42 కోట్లు
అప్పులు: 16.86 లక్షలు
భార్య: పరిటాల జ్ఞాన పేరు మీద
స్థిరాస్తి: రూ. 44.28 లక్షలు
చరాస్తి: రూ. 31.04 లక్షలు
పేరు: పరిటాల సునీత
పార్టీ : తెలుగుదేశం
నియోజకవర్గం: రాప్తాడు
విద్యార్హత: పదో తరగతి
కేసులు: 9
స్థిరాస్తి: రూ. 28.53 కోట్లు
చరాస్తి: రూ. 1.12 కోట్లు
అప్పులు: 31.68 లక్షలు



మూడో రోజు 23 నామినేషన్లు

- రెండు ఎంపీ స్థానాలకు 5
- 14 అసెంబ్లీ స్థానాలకు 18
- రాప్తాడులో పరిటాల సునీత, శ్రీరామ్ నామినేషన్

అనంతపురం టౌన్/పుట్టపర్తి, ఏప్రిల్ 20: ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు మూడో రోజు శనివారం 23 నామినేషన్లు దాఖలయ్యాయి. హిందూపురం ఎంపీ స్థానానికి నాలుగు, అనంతపురం ఎంపీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైంది. 14 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 18 నామినేషన్లు దాఖలయ్యాయి.

● కడప జిల్లా బద్వేలుకు చెందిన ఓ.శ్రీనివాసరాజు భారతీయ పంచాయతీ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి తరుపున ఆయన భార్య కమలమ్మ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా కుళ్ళాయప్ప, బీఎస్పీ తరుపున నాగరాజు నామినేషన్ వేశారు.

● అనంతపురం జిల్లా రాప్తాడు అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరఫున పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఇండిపెండింట్‌గా రఘురామయ్య నామినేషన్ వేశారు. గుంతకల్లులో ఇండిపెండింట్ అభ్యర్థి ఖమార్ బేగం నామినేషన్ వేశారు. ఉరవకొండలో వైసీపీ తరఫున ప్రణయ్ రెడ్డి పేరిట ఆ పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. కళ్యాణదుర్గంలో బీఎస్పీ తరఫున హరిజన నాగమ్మ నామినేషన్ వేశారు. తాడిపత్రిలో ఇండిపెండెంట్‌గా రుషింగప్ప, శింగనమలలో వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు నామినేషన్ దాఖలు చేశారు.

● శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పుర్రోళ్ళ నరసింహప్ప, ధర్మవరం స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా దాసరి కవిత నామినేషన్ వేశారు. కదిరిలో వైసీపీ తరఫున సయ్యద్ మహమ్మద్ అఖిల్, బీఎస్పీ తరఫున రామచంద్ర నామినేషన్ వేశారు. మడకశిరలో టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్, బీఎస్పీ అభ్యర్థి ఇందీవర్, హిందూపురంలో ఎస్‌యూసీఐ తరఫున రవీంద్ర, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ గౌస్ నామినేషన్లు వేశారు.


నామినేషన్ పత్రం ఆర్ఓకు అందిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్





జేసీ అశ్మిత్‌రెడ్డి తరఫున నామినేషన్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నువ్వే సూసుకోల్ల సామీ..!

■ రాజకీయ నాయకులకు మస్తానయ్య దర్గా సెంటిమెంట్


మస్తాన్ వలి స్వామి సమాధి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 20: గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్ వేసేముందు మస్తానయ్యస్వామి దర్గాలో పూజలు చేయడం సెంటిమెంట్‌గా మారింది. పాతగుంతకల్లులో వెలసిన సయ్యద్ హజరత్ మస్తాన్‌వలి దర్గాకు 400 సంవత్సరాల చరిత్ర ఉంది. ఎమ్మెల్యే అభ్యర్థులు బీఫారంను దర్గాలో ఉంచి ప్రార్థనలు చేసిన తరువాత భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి నామినేషన్‌లు దాఖలు చేస్తారు. పార్టీలు ఏవైనా తమ కార్యక్రమాలు దర్గా నుంచి ప్రారంభిస్తే సక్సెస్ అవుతాయనే నమ్మకం ఉంది.

ప్రారంభించారు... వదిలేశారు..!

గ్రామంలో అపరిశుభ్రత లేకుండా చేస్తానని హామీ ఇచ్చి, పనులు ప్రారంభించి, మధ్యలో వదిలేయడంపై శింగనమల ప్రజలు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శింగనమలకు అండర్ డ్రైనేజ్ వ్యవస్థ తీసుకొచ్చి అపరిశుభ్రత లేకుండా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈపనులను రూ.1.5 కోట్లతో 2020 ఫిబ్రవరి2న ప్రారంభించారు. అయితే ఆపనులను కేవలం 25 శాతం చేసి వదిలేశారు. దాంతో గ్రామంలో ఏ వీధులో చూసినా మురుగునీరే దర్శనమిస్తోంది. ఈక్రమంలో దోమలు పెరిగి, గ్రామంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శింగనమల


శింగనమలలో అండర్ డ్రైనేజీ పనుల శిలాఫలకం

అధ్వానపాలనకు టింకరింగ్ చేస్తా..!

సమస్యలపై మండిపడిన సామాన్యుడు

అతనేమి రాజకీయ నాయకుడు కాదు. ధనవంతుడు అసలే కాదు. పదవిపై మోజు కూడా లేదు. అతడు కార్లకు టింకరింగ్ చేసుకునే సామాన్యుడు. కానీ తను ఎదుర్కొన్న సమస్యలు, తన చుట్టూ ఉన్న పరిస్థితులు అతని కడుపు మండించాయి. అందుకే రాజ్యాధికారముంటునే వీటన్నింటిని ఎదుర్కొగలననే ఆలోచనను రేకెత్తించాయి. ఈక్రమంలోనే ఆయన హిందూపురం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా శనివారం నామినేషన్ వేశాడు. ఆయనే హిందూపురంలో కార్ల టింకరింగ్ చేసే మహ్మద్. తాను నామినేషన్ వేయడానికి కారణాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఒక మారు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే సరిగా చికిత్స చేయకుండా తనతో దురుసుగా ప్రవర్తించడం బాధించిందన్నారు. అలాగే హిందూపురంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇటీవల రైల్వే రోడ్డు వెడల్పులో భాగంగా భవనాలు పగులగొట్టి అలానే వదిలేశారని, పట్టణానికి రింగ్‌రోడ్డు లేదని, పెద్ద వాహనాలు వస్తే ఇబ్బంది కలుగుతుందని ఇలాంటి సమస్యలు పరిష్కారం కోసమే ఎన్నికల బరిలో నిలిచానన్నారు. ఇవే ప్రధాన ప్రచారాంశాలుగా ప్రజల్లోకి వెళ్తానని 'ఆంధ్రజ్యోతి'తో తెలిపాడు.

- హిందూపురం అర్బన్


నామినేషన్ దాఖలు చేస్తున్న మహ్మద్

టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గుత్తా


టీడీపీ నాయకులు బండారు శ్రావణిశ్రీ, ఆలం, కేశవరెడ్డిలతో మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు , సాకే రామకృష్ణ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 20: శింగనమల నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగలింది. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు, వైసీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సాకే రామకృష్ణ శనివారం చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల అనంతరం గుత్తా వెంకటనాయుడు టీడీపీలో స్తబ్ధుగా ఉండిపోయాడు. 2019 ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి తరఫున పుట్లూరు మండలంలో ప్రచారం చేపట్టారు. అనంతరం కాలంలో వైసీపీ విధానాలు నచ్చక తిరిగి సొంతగూటికి చేరినట్లు వెల్లడించారు. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన సాకే రామకృష్ణ వైసీపీలో ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు లేదని, కేవలం ఓ సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనే ఆ పార్టీలోకి చేరినట్లు తెలిపారు.


చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా వేసుకుంటున్న వైసీపీ జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు సాకే రామకృష్ణ

వ్యయ పర్యవేక్షణ టీంల మధ్య సమన్వయం అవసరం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 20: అభ్యర్థులు, పార్టీల ఖర్చుల పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీల మధ్య సమన్వయం ఉండాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ షిండే సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతి టీమ్ తమకు కేటాయించిన బాధ్యతలను పక్కాగా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితిల్లోను కమిషన్ నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. మీరు ఇచ్చే ప్రతి రిపోర్టు పారదర్శకంగా ఉండాలని, అందులో ఏ పొరపాటు ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర వ్యయ పరిశీలకులు రందాస్ టీ. కాలే, నితిన్ అగర్వాల్, కలెక్టరు వినోద్‌కుమార్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు విలాస్ షిండే, కలెక్టర్

జన కేతనం
ఆంధ్రజ్యోతి
7
అనంతపురం శ్రీసత్యసాయి
ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఆ రోజుల్లో...



ఓటరు దేవుడయ్యే సమయం వచ్చింది. స్వతంత్ర భారతావనిలో ఎన్నికల సమరం మొదలైన నాటి నుంచి నేటి దాకా అనేక చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అభ్యర్థుల ప్రచార సరళి, ఓటింగ్ విధానంలో అనేక మార్పులు వచ్చాయి. గతంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఓటు వేసేవాళ్లమని, ప్రజల విరాళాలతో అభ్యర్థుల తరపున ప్రచారం చేసేవాళ్లమని పలువురు వృద్ధ ఓటర్లు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి సంఘటనల అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నచ్చిన వ్యక్తికి ప్రచారం చేసేవాళ్లం



నేను యుక్తవయసులో ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమైంది. అప్పుడు ఎన్నికల్లో మాకు నచ్చిన వ్యక్తి కోసం ప్రచారానికి కూడా వెళ్లేవాళ్లం. అభ్యర్థులు వాహనాల డీజిల్, భోజనాల ఖర్చులు కూడా పెట్టుకోలేని స్థితిలో ఉండే వాళ్లు. అందుకే మంచోళ్లకు ప్రజలే విరాళాలిచ్చి గెలిపించేవాళ్లు. ఇప్పుడు ఎన్నికలు బాగా ఖరీదుగా మారాయి. ఎన్నికల ప్రచారానికి కూడా రోజువారి కూలీలను పెట్టుకుంటున్నారట. నిజంగా మన గ్రామ అభివృద్ధి కోరుకునేవారు ఎవరైనా సరే డబ్బులు తీసుకోకుండా ఓటు వేయాలి. నిజాయతీపరున్ని గెలిపించుకోవాలి.

- నిచ్చెనమెట్ల పుల్లయ్య, తాడిమర్రి

రెండు మైళ్ల దూరం వెళ్లేవాళ్లం



ఓటేసేకి మా ఊరి నుంచి రెండు మైళ్ల దూరంలో ఉండే ఊరికి ఎద్దులబండిలో వెళ్లేవాళ్లం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఓటేశాం. ఉప్పునేసినపల్లి పంచాయతీ కింద మా ఊరు ఉంది. అప్పట్లో నేను నా భర్త రామప్పతో కలిసి ఉప్పునేసినపల్లికి వెళ్లి ఓట్లువేసేవాళ్లం. అక్కడ పార్టీల వాళ్లు ఉదయం ఉగ్గాని వడ పెట్టెవాళ్లు. ఓటువేసి ఆ టిఫిన్ తిని తిరిగివచ్చేవాళ్లం. 2014నుంచి మా గ్రామంలోనే ఓటు వేసుకునేందుకు అవకాశం వచ్చింది.

- రామలక్ష్మమ్మ, గరుడంపల్లి గ్రామం, ధర్మవరం రూరల్

రైతులే ఎడ్ల బండ్లు ఏర్పాటు చేసేవారు



మాది శింగనమల మండలంలోని గురుగుంట్ల గ్రామం. యాభై ఏళ్ల కిందట పంచాయతీ కేంద్రంలో ఓటు వేసేవారు. పంచాయతీ పరిధిలో నాలుగైదు గ్రామాలు ఉండేవి. ఓటర్లు పంచాయతీ కేంద్రంలో ఓటు వేయడానికి వెళ్లేందుకు రైతులు ఎడ్లు బండ్లు పంపేవారు. నాకు ఓటు హక్కు వచ్చిన సంవత్సరం ఎన్నికలు జరిగాయి. అప్పుడు మంచి వ్యక్తికి ఓటు వేయాలనే భావన ఉండేది. ఓటు వేయడానికి పక్క గ్రామానికి వెళ్లేవాళ్లం. ఉదయమే ఓటు వేయడానికి వెళ్లే వాళ్లం. అక్కడ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఉగ్గాని తిని కాఫీ తాగి ఓటు వేసి వచ్చేవాళ్లం. ఇప్పటి మాదిరి డబ్బులు పంపిణీ ఉండేది కాదు. మా ఇళ్లలో పెద్దలు చెప్పిన గుర్తులకు ఓటు వేసేవాళ్లం.

దైవయత్నం, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్, గురుగుంట్ల, శింగనమల మండలం

ఉగ్గాని పెడితే చాలు..



ఇప్పుడు ఓటేయడానికి రావాలంటే కొందరికి మందు, బిర్యాని, దుడ్లు ఇస్తున్నారు. మాకాలంలో బొరుగుల ఉగ్గాని పెడితే చాలనుకునేవాళ్లం. నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇరవై ఏళ్ల వరకూ ఎన్నికలు వచ్చాయంటే చాలు గ్రామంలో ఒక చోట అభ్యర్థులు ఉదయమే బొరుగుల ఉగ్గాని కలిపించేవారు. ఆ పార్టీకి, ఆ వ్యక్తికి సానుభూతిపరులు, తటస్థంగా ఉన్న వారు మాత్రం ఈ ఉగ్గాని తీనేకి వచ్చేవారు. ప్రతిపక్ష సానుభూతిపరులు వచ్చేవారు కాదు. వాళ్ల శిబిరం వేరుగా ఉండేది. ఎన్నికలు వారం ముందు నుంచే ఊర్లో ఫలానా చోట ఉగ్గాని చేస్తామని ప్రచారం చేసేవాళ్లం. రాను రాను ఉగ్గాని కనుమరుగై పోయాయి. అందరూ కలిసి మాట్లాడుకున్న తర్వాత గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తాడని భావించిన వ్యక్తికే ఓటు వేసేవాళ్లం.

- నారాయణరెడ్డి, సలకం చెరువు, శింగనమల మండలం

తస్మదీయులకే తంటాలు..!

వైసీపీ వర్గీయులైతే అంతా ఓకే

ఆరోపణలున్నా తూతూమంత్రంగా విచారణ
ప్రశ్నించేవారిపై సస్పెన్షన్ వేటు
రాష్ట్ర ప్రభుత్వ తీరుపై టీచర్ల ఆగ్రహం

అనంతపురం విద్య, ఏప్రిల్ 20: మన వాళ్లయితే వదిలేద్దాం. పరాయి వారైతే వేటేద్దాం అనేలా వైసీపీ పాలన సాగుతోంది. వైసీపీ అనుబంధ ఉపాధ్యా య సంఘాల నాయకులు, ఆ పార్టీకి కొమ్ముకాసే ఉపాధ్యాయ సంఘం టీచర్లు ఏం చేసినా చర్యలు తీసుకోరు. ఇతర సంఘాల నాయకులు తమ సమస్యలపై ప్రశ్నించినా వేటాడుతారు..చర్యలు తీసుకుంటారు. ఈ పక్షపాత వైఖరిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అయితే సమస్యలపై గళం విప్పిన సంఘాల నాయకులైన ఇద్దరు టీచర్లను శనివారం సస్పెండ్ చేయడం అనేక విమర్శలకు తావిస్తోంది.

చర్యలు తీసుకోకుండా ఒత్తిళ్లు

అనంతపురం నగర శివారులోని ఓ డాబాలో వైసీపీకి అనుబంధంగా నడిచే ఉపాధ్యాయ సంఘం, అనుకూలంగా నడిచే మరో ఉపాధ్యాయ సంఘం నాయకులు గతనెలలో ఆదివారం రాత్రి రాజకీయ విందు చేసుకున్నారు. భారీ ఎత్తున టీచర్లు, సంఘాల నాయకులు, హెచ్ఎంలు, పీడీలు తదితరులు హాజర య్యారు. వైసీపీకి లబ్ధిచేకూర్చాలన్న ఉద్దేశంతోనే అందరూ కలిశారు. దీనికి వైసీపీ ఎమ్మెల్యే కూడా హాజరయ్యారు. ఈ పొలిటికల్ డిన్నర్‌పై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా తూతూ మంత్రంగా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిపై చర్యలు తీసుకోకుండా కొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు సైతం అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చినట్టు సమాచారం.



డీఈఓ ఆఫీస్ (ఫైల్)

సమస్యలు పరిష్కరించాలని అడగటం నేరమా..?

జగన్ ప్రభుత్వం తమను వేధిస్తోందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇష్టమొచ్చిన తేదీల్లో జీతాలు వేయడం, 117 జీవో తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేయడం, అసంబద్ధ నిర్ణయాలు తీసుకోవడం, సీపీఎస్ రద్దు చేయకపోవడం వంటి సమస్యలను ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతోపాటు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ సమస్యలు పరిష్కరించాలని అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఇదే నేరమన్నట్లుగా ఇద్దరు టీచర్లను అధికారులు సస్పెండ్ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఏ పార్టీకి లబ్ధి చేకూర్చేలా ప్రచారం చేయకపోయినా సంఘాల నాయకులు, టీచర్లు అయిన విజయభాస్కర్, హరికృష్ణను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆ మీటింగ్‌ను దెబ్బకొట్టడానికేనా..?

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ), ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ సంఘాల ఐక్యవేదిక చైతన్య సదస్సు ఆదివారం జరగనుంది. సదస్సును అనంతపురం నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డులోని ఆర్‌జేసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. సుమారు 20 నుంచి 30 సంఘాలకు చెందిన ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లు వేలాది మంది హాజరయ్యే అవకాశం ఉంది. ఈ ఐక్యవేదిక రాష్ట్ర కో చైర్మన్‌గా హరికృష్ణ వ్యవహరిస్తున్నారు. ఈ సదస్సు నిర్వహణలో క్రియాశీలకంగా ఉన్నారు. దీంతో హరికృష్ణపై సస్పెన్షన్ వేటు వేస్తే... ఇతర టీచర్లు కూడా సదస్సుకు హాజరుకావడానికి వెనుకడుగు వేస్తారన్న కోణంలో కూడా సస్పెన్షన్ వేటు వేసినట్టు చర్చ నడుస్తోంది. ఆయనతో పాటు, విజయ్‌భాస్కర్‌పై సైతం సస్పెన్షన్ వేటు వేయడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే బహిరంగంగా రాజకీయ విందు చేసుకున్న వైసీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లపై చర్యలు తీసుకోకుండా తప్పించే యత్నాలపై టీచర్లు భగ్గుమంటున్నారు. ఇదెక్కడి అన్యాయమంటూ తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు



నామినేషన్ రోజు వేషధారణతో మారుతిప్రసాద్

వేషంతో జోష్

ఎన్నికలు వచ్చాయంటే చాలు..! ఆయనలో ఉన్న కళాకారుడు నిద్ర లేస్తాడు. టీడీపీ అభ్యర్థి నామినేషన్ వేసిన సందర్భంగా ప్రతి ఎన్నికలోనూ ఓ వేషంతో ర్యాలీలో పాల్గొంటాడు. ప్రత్యేక ఆకర్షణగా ఊరేగింపులో ముందు భాగాన నడుస్తూ తన హావభావాలతో కార్యకర్తల్లో జోష్ పెంచుతాడు. ఈ అలవాటు ఆయనకు చిన్నతనం నుంచే ఉన్నట్లు తెలిపాడు. ఆయనే లేపాక్షి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు మారుతీప్రసాద్. 2014 ఎన్నికల సమయంలో శ్రీకృష్ణదేవరాయలు వేషం ధరించి ర్యాలీలో పాల్గొన్నాడు. 2019లో బాలకృష్ణ నటించిన లెజెండ్ సినిమాలోని హీరో వేషధారణతో గుర్రంపై స్వారీ చేశాడు. ఈ ఏడాది కూడా శ్రీకృష్ణదేవరాయల వేషంతో గుర్రంపై ఊరేగింపులో పాల్గొన్నాడు. గుర్రాన్ని అనంతపురం నుంచి తెప్పించి మరో ఇద్దరితో వేషధారణ వేయించి ర్యాలీలో అందరినీ ఆకట్టుకున్నారు.

- హిందూపురం

బీకేఎస్‌లో గ్రామ వలంటీర్లు రాజీనామా చేస్తున్న దృశ్యం



రాజీనామా చేస్తే పది వేలు..!

గ్రామ వలంటీర్లపై వైసీపీ ఒత్తిడి

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 20

శింగనమల నియోజకవర్గంలో వైసీపీ నాయకుల ఒత్తిడితో గ్రామ వలంటీర్ల రాజీనామాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆరు మండలాల్లో 600 మందికిపైగా వలంటీర్లు రాజీనామాలు చేసేందుకు సిద్ధం అయినట్లు తెలిసింది. ఇప్పటికే వందమందికి పైగా రాజీనామా చేశారు. వైసీపీ గృహ కన్వీనర్లు గ్రామ వలంటీర్లుతో రహస్య సమావేశాలు పెట్టి ఈ ఎన్నికలలో వైసీపీ తరపున పని చేయండి ఒక్కొక్కరికి రూ.10వేలు ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఎన్నికలలో గెలుపొందిన అనంతరం మీకే పోస్టులు వస్తాయని, వీటితో పాటు వేతనం రూ.పదివేలు వస్తుందని ప్రలోభ పెడుతున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో 1400 మందికి పైగా వలంటీర్లు ఉండగా అందరూ రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే ఎన్నికల కమిషన్ వేటు వేస్తుండంతో రాజీనామా తెరపైకి తెచ్చినట్లు స్పష్టమతోంది.



వీధుల్లో ప్రవహిస్తోంది. ఎప్పుడూ గ్రామంలోని నేలంతా చిత్తడిగా ఉండటంతో విషపురుగుల సంచారం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చొరవ తీసుకుని ఆర్ అండ్‌ఆర్ (పరిహారం పునరావాసం) కింద రూ.5½ కోట్లు మంజూరు చేయించారు. సర్వేలు నిర్వహించి, నివేదికలు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. 2019 ఎన్నికల సమయంలో ఉరవకొండ వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్‌రెడ్డి స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రచారం చేస్తూ తమ పార్టీ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తానని

మీకు ఓటు ఎందుకెయ్యాల్ల ?

జీడిపల్లి గ్రామస్థులు

బెళుగుప్ప, ఏప్రిల్ 20: 'ఊటనీటిముప్పు సమస్యను అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. ఇన్నాళ్లైనా పట్టించుకోలేదు. ఇప్పుడు ఓట్లడిగేకి వస్తాండారు. మీకెందుకు ఓటెయ్యాల్ల' అని వైసీపీ నాయకులను మండలంలోని జీడిపల్లి గ్రామస్థులు నిలదీస్తున్నారు. రిజర్వాయరుకు దిగువనే గ్రామం ఉండటంతో ఊటనీరు

స్వామి మీద ప్రమాణం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏళ్లు గడిచినా హామీ మాత్రం నెరవేరలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గుడి ముందు ప్రమాణం చేసి మోసపుచ్చడం దారుణం



మూడు నెలల్లోగా ఊట నీటి సమస్య పరిష్కరిస్తామని అంజనేయస్వామి గుడి ముందు ప్రమాణం చేశారు. ఏళ్లు గడిచినా పట్టించుకోకపోవడం దారుణం. ఇలాంటి మోసపూరిత పార్టీకి ఎందుకు ఓటెయ్యాలి.

- దామోదర, జీడిపల్లి

ఉత్తుత్తి హామీలిచ్చేవారికి ఓటెందుకు వేయాలి



ఉత్తుత్తి హామీలిచ్చే వైసీపీ నాయకులకు ఓటెందుకు వేయాలి. అన్ని వసతులతో పునరావాస చర్యలు చేపట్టేందుకు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మంజూరు చేయించిన పథకాన్ని పక్కన పెట్టి, తాము తీరుస్తామంటూ హామీ లిచ్చి మరిచారు. వీరెందుకు మాకు.

- వెంకటనాయుడు, గ్రామ సర్పంచ్, జీడిపల్లి

ఎస్సీ,ఎస్టీలను కూలీలుగా మార్చిన వైసీపీ

భూమి కొనుగోలు పథకానికి మంగళం
ఐదేళ్లలో ఒక్క ఎకరా కొనుగోలు చేయని దుస్థితి
టీడీపీ హయాంలో ఎస్సీలకు రూ. 23.31 కోట్లతో 799 ఎకరాలు
ఎస్టీలకు రూ. 62.72 లక్షలతో 49.44 ఎకరాల కొనుగోలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 20 : 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. వారి అభివృద్ధే నా ధ్యేయం... వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తా' అంటూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బహిరంగ సభల్లో అలవికాని ప్రేమ ఒలకబోస్తూ ఉంటారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి ఎక్కడ జరిగిందో... ఎలా జరిగిందో అర్థంకాని విధంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ఎస్సీ,ఎస్టీలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టాయి. అందుకనుగుణంగా భూములను కేటాయిస్తూ వచ్చాయి. గత టీ డీపీ ప్రభుత్వం ఎస్సీ,

> వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీలకు తీరని అన్యాయం జరిగింది. 27 పథకాలను రద్దు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇవ్వకుండా మోసం చేశారు. పేద ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవెలబుల్ స్కూల్ స్కీంను ఎత్తేసి కార్పొరేట్ విద్యకు దూరం చేశారు. పేద ఎస్సీ,ఎస్టీ ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద ఎంతో మంది పేద ఎస్సీ, ఎస్టీలకు భూములను ఉచితంగా కేటాయించింది. వైసీపీ వచ్చాక ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వకుండా మోసం చేసింది. సీఎం జగన్‌రెడ్డి నా ఎస్సీ.. నా ఎస్టీ అంటూనే ఆ వర్గాలను అణచివేతకు గురిచేశారు.
>
> -లక్ష్మన్న, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, పి. నారాయణపురం, కూడేరు

వైసీపీ హయాంలో అన్యాయం



ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ల సముదాయం పెన్నార్ భవన్

ఎస్టీల కోసం భూములు కొనుగోలు చేసి వారికందించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ స్కీమ్‌ను తొలగించి ఆ వర్గాల ప్రజల నోట్లో మట్టి కొట్టింది. వైసీపీ ఐ దేళ్ల పాలనలో ఒక్క ఎకరా కొనుగోలు చేయలేదంటే ఎస్సీ,ఎస్టీల పట్ల ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉంటే అర్థమవుతోంది. ఎస్సీ,ఎస్టీలు అగ్రవర్ణాల కిం ద కూలీలుగా ఉండాలనే దురుద్దేశ్యంతోనే తమను ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ కూలీలుగా మార్చిందని ఆ వర్గాలు మండిపడుతున్నాయి.

టీడీపీ హయాంలో భూముల పంపిణీ

2014 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో భూములు లేక వ్యవసాయ కూలీలుగా ఉన్న ఎస్సీలకు ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద భూములు అందించాలని తలంచింది. ఇందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భూములు లేనినిరుపేద ఎస్సీల జాబితాను సిద్ధం చేసింది. కార్పొరేషన్ అధికారులు అందించిన నివేదికల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 317 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో 799.98 ఎకరాల భూమిని గుర్తించి కొనుగోలు చేసింది. ఆ భూముల కొనుగోలు కోసం రూ. 23.31 కోట్లను ఖర్చు చేసింది. ఎస్టీ వర్గాల్లో వ్యవసాయ భూములు లేని వారి కోసం ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద రూ. 62.72 లక్షల నిధులను విడుదల చేసింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 22 మందిని ఎంపిక చేశారు. వారి కోసం దాదాపు 49.44 ఎకరాలను కొనుగోలు చేసి అప్పగించారు. ఎస్టీల కోసం వ్యవసాయానికి బోర్లు లేని వారిని 20 మందిని ఎంపిక చేసి డిగ్గింగ్ బోర్ వెల్స్ స్కీమ్ కింద 20 మంది లబ్ధిదారులకు రూ. 22.80 లక్షలు ఖర్చు చేసి బోర్లు వేయించింది. బోర్లు ఉండి విద్యుత్ సౌకర్యం లేని వారి కోసం ఎనర్జిసేషన్ ఆఫ్ ఎస్టీ బోర్ వెల్స్ పథకం కింద 690 మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ. 6.62 కోట్లు ఖర్చుచేసి కరెంటు సౌకర్యాన్ని కల్పించింది. మొత్తం మీద ఎస్సీ,ఎస్టీ పేద ప్రజల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 30 కోట్లకుపైగా ఖర్చు చేసింది.

భూములు పంచకపోగా... కబ్జాకు స్కెచ్...

టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల కోసం భూములు కొనుగోలు చేసి అందిస్తే... వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క ఎకరా కొనుగోలు చేయకపోగా... గతంలో లబ్ధిదారులకు అందించిన భూములపై కన్నేసింది. వైసీపీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ఎస్సీ,ఎస్టీల చేతుల్లో ఉన్న భూములను కబ్జాకు స్కెచ్ చేశారు. ప్రధానంగా తాడిపత్రి పరసర ప్రాంతాలు యల్లనూరు, పుట్లూరుతో పాటుమరి కొన్ని ప్రాంతాల్లో దాదాపు 160 ఎకరాలకుపైగానే పలువురు రాజకీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆ ప్రజాప్రతినిధుల వద్ద తీసుకున్న అప్పును తీర్చలేక... భూములను విడిపించుకోలేక సతమతమవుతున్నారు. ఇలా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీ ప్రజలకు ఉన్న పథకాలను వర్తింపజేయకపోగా ఉన్నవాటిని లాగేసుకునే ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎగిరే గువ్వలకు లక్షల గింజలు !

వైసీపీ కార్పొరేటర్లు పక్క చూపులు చూడకుండా తాయిళాలు
అనంత అర్బన్‌లో బలాన్ని బట్టి రూ. లక్షల చెల్లింపు



అనంతపురం క్రైం, ఏప్రిల్ 20: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అధికార వైసీపీ తమ పార్టీ కార్పొరేటర్లకే డబ్బు పంచాల్సి వస్తోంది. కొందరు కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఉండటంతో వారు టీడీపీ వైపు వెళ్తారేమోననే ఆందోళనతో అధికార పార్టీ తాయిళాలకు తెర తీసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు వారి బలాన్ని బట్టి రూ.లకారాలు ముట్టజెప్పినట్లు తెలిసింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 50 డివిజన్లు, నాలుగు గ్రామ పంచాయతీలున్నాయి. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా అనంతవెంకటరామిరెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ఈ ఇద్దరి మధ్యే ఉండనుంది.

ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు...

ఎన్నికలు సమీపిస్తున్నా కొందరు కార్పొరేటర్లు సైలెంట్‌గా ఉండటం వైసీపీ అభ్యర్థికి గుబులు పుట్టించింది. దీంతో కొత్త ఓట్లు దేవుడెరుగు, ఉన్న ఓట్లు నిలుపుకుంటే చాలు అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కార్పొరేటర్లకు తాయిళాల పంపకం చేపట్టినట్లు తెలుస్తోంది. మూడేళ్ల కిందట జరిగిన మున్సినల్ ఎన్నికల్లో నగరపాలిక పరిధిలోని 50 డివిజన్లకు గాను 48మంది కార్పొరేటర్లు వైసీపీ తరపున గెలుపొందారు. వీరిలో అత్యధికులు కొత్తగా పోటీ చేసిన వారే. అనంతపురం అర్బన్‌లో ఇంకా కొన్ని వర్గాలు ఎమ్మెల్యే అభ్యర్థికి దూరంగానే ఉంటున్నాయి. అదే క్రమంలో కొందరు కార్పొరేటర్లు సైతం ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లకు లెక్కల గాలం వేసినట్లు సమాచారం. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అందజేసినట్లు తెలిసింది. నగరంలోని 30మంది కార్పొరేటర్లకు లెక్కలు అందినట్లు తెలుస్తోంది.

జంపింగ్ ఊహాగానాలతోనే....

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓ ప్రచారం ఊపందుకుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి 15మంది వరకు కార్పొరేటర్లు వెళ్తారనే ప్రచారం జరిగింది. దీంతో ఆ గోడ దూకే కార్పొరేటర్లపై వైసీపీ నేతలు ఆరా తీసినట్లు తెలిసింది. రెండు వారాల కిందట కార్పొరేటర్లు హరిత, బాబా ఫకృద్దీన్‌లు టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో మరింత మంది జంప్ అయ్యే ప్రమాదముందని భావించిన వైసీపీ నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. అందుకే ముడుపుల బేరం పెట్టినట్లు సమాచారం. అలా రూ.లకారాలు జేబుల్లోకి నింపుకున్న కార్పొరేటర్లు వైసీపీ అభ్యర్థి ప్రచారంలో సందడి చేస్తున్నారట.

దోస్త్ మేరా దోస్త్ !

సరిగ్గా ఐదేళ్ల కిందట వారిద్దరు రాజకీయ ప్రత్యర్థులు. ఎప్పుడైనా ఎదురుపడినా ఒకరివైపు ఒకరు చూసుకునేవారు కాదు. నిన్న మొన్నటి దాకా అలాగే ఉండేవారు. అయితే అధికార పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలు ఆ వైసీపీ నాయకుడి ఆలోచనలు మార్చివేసింది. గౌరవం లేని చోట ఉండటం ఎందుకని భావించి ఏపార్టీని అయితే ప్రత్యర్థిగా భావించి పని చేశారో అదే పార్టీలోకి చేరిపోయారు. ఆయనే మాజీ పోలీస్ అధికారి మహ్మద్ ఇక్బాల్. ఆయనకు ప్రత్యర్థి నందమూరి బాలకృష్ణ. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ చెరో పార్టీ తరపున పోటీ చేశారు. అప్పుడు టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ గెలుపొందగా ఇక్బాల్ ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఇక్బాల్ హిందూపురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా గత ఏడాది జూలై వరకు కొనసాగారు. దీంతో వారి మధ్య రాజకీయ వైరం కొనసాగింది. కానీ పార్టీ తన పట్ల వ్యవహరిస్తున్న తీరును ఇక్బాల్ జీర్ణించుకోలేక పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. రెండు రోజుల కిందట చిలమత్తూరు మండలంలో వైసీపీ నాయకుడు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరు ఎమ్మెల్సీ అనుచరులు కావడంతో చేరిక సందర్భంగా ఇక్బాల్ చిలమత్తూరుకు వచ్చారు. అక్కడికి బాలకృష్ణ కూడా వచ్చారు. నాగరాజుయాదవ్ ఇంట్లో బాలకృష్ణ, ఇక్బాల్ చేతులు కలిపారు. ఇది చూసిన జనం నాటి ప్రత్యర్థులే నేడు సన్నిహితులయ్యారని ఇద్దరికీ జై కొట్టారు.



చేతులు కలిపిన బాలకృష్ణ, ఇక్బాల్

- హిందూపురం


టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ రహమత్ బీ, వైసీపీ నాయకులు


ప్రచారం చేస్తున్న దగ్గుబాటి శ్రీలక్ష్మి, పెండ్యాల శ్రీలత

'అనంత'ను సొంత పార్టీ వారే ఓడిస్తారు

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 20 : ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పతనం ఆయన సొంత డివిజన్ నుంచే మొదలైందని, సొంత పార్టీ వారే ఆయన్ను ఓడించబోతున్నారని కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక 16వ డివిజన్‌లోని తన నివాసంలో మాజీ కార్పొరేటర్ రహమత్ బీ వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆమెతోపాటు వందమందికి దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణలు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీలో తనకు ఎలాంటి గుర్తింపు, న్యాయం జరగలేదని, అందుకే టీడీపీ చేరినట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే అనంతపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చాలా ఆగ్రహం, అసంతృప్తితో ఉన్నారని, వైసీపీ నుంచి వలసలే అందుకు నిదర్శనమని అన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరనున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు లింగారెడ్డి, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

దగ్గుబాటి శ్రీలక్ష్మి ప్రచారం: అనంతపురం అర్బన్ పరిధిలోని ఒకటో డివిజన్ మహాత్మాగాంధీ కాలనీలో అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ భార్య శ్రీలక్ష్మి, జనసేన నాయకులు పెండ్యాల శ్రీలతతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం 17వ డివిజన్‌లో టీడీపీ నాయకులు నాగరాజు, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 45 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.

చంద్రబాబుకు దగ్గుబాటి శుభాకాంక్షలు

కణేకల్లు క్రాస్‌లోని విడిది కేంద్రంలో చంద్రబాబును దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనంత అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించారు. అనంతరం స్థానిక శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని జిల్లా కో-ఆర్డినేటర్ కోవెలమూడి నానితో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, బుగ్గయ్యచౌదరి, దేవళ్ల మురళి, రాజారావు, సంగా తేజస్విని, అయేషా పాల్గొన్నారు.


చంద్రబాబు జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దగ్గుబాటి ప్రసాద్

లక్ష ఎకరాలకు సాగునీరు ఏమైంది..?

● ప్రకాష్‌రెడ్డీ.. ఆ హామీని మరిచావా..? ● ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పరిటాల సునీత

రాప్తాడు, ఏప్రిల్ 20: 'అధికారంలోకి వస్తే పిల్ల కాలువల ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు ఇస్తానని హామీ ఇచ్చావ్ గుర్తుందా ప్రకాష్‌రెడ్డి... ఐదేళ్లు అయింది... ఒక్క సెంటుకు కూడా నీరు ఇవ్వలేదు.. కనీసం ఒక్క చెరువుకు కూడా నీరివ్వలేదు... ఇక నీ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు..' అని మాజీ మంత్రి పరిటాల సునీత ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని గాండ్లపర్తి, వరిమడుగు, బండమీదపల్లి, మరూరు గ్రామాల్లో ఆమె పర్యటించిన ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు బనీన్లు బక్కలు పడ్డాయని చెప్పి... అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి చేయకుండా జేబులు నింపుకున్నారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో గెలిచాక నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. ఎంతో ఆర్భాటంగా ఇచ్చిన లక్ష ఎకరాలకు నీరిస్తానని హామీ ఇచ్చా... కనీసం గొర్రెలకు తాగేందుకు కూడా నీళ్లు లేకుండా చేశావని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ. 8 కోట్లు ఖర్చు పెట్టి కాలువ తవ్వి బండమీదపల్లి చెరువుకు నీరిచ్చామన్నారు. సీసీరోడ్లు, అంగన్‌వాడీలు, వసతి గృహం, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. అభివృద్ధిలో రాప్తాడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపామన్నారు. గత ఎన్నికల్లో తన గెలుపు కోసం పనిచేసిన వారిపైనే దాడులు చేయించి వారిపైనే కేసులు పెట్టిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు, ప్రతి చెరువుకు నీరందిస్తామన్నారు.

టీడీపీలోకి : మండలంలోని గాండ్లపర్తి గ్రామంలో 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరాయి. అనంతరం చంద్రబాబు జన్మదినం సందర్భంగా గాండ్లపర్తి గ్రామస్థులు, మహిళలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, జనసేన రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే పవన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ నెమలివరం ఈశ్వరయ్య, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.



పరిటాల సునీత సమక్షంలో గాండ్లపర్తిలో టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులు, మరూరులో గజమాలతో గ్రామస్థుల సన్మానం

టీడీపీలో చేరిన మున్సిపల్ మాజీ చైర్మన్

అనంతపురం అర్బన్ : అనంతపురం మున్సిపల్ మాజీ చైర్మన్, నూర్ బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నూర్‌మహ్మద్ టీడీపీలో చేరారు. శనివారం కణేకల్లు క్రాస్‌లోని విడిది కేంద్రంలో చంద్రబాబు సమక్షంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంత అర్బన్‌లో దగ్గుబా టి ప్రసాద్ విజయం కోసం కృషి చేయాలని చంద్రబాబు సూచించారు.



చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 691 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.


స్వామి వారిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

క్రిష్ణంరెడ్డిపల్లిలో వనభోజనోత్సవం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 20: మండలంలోని క్రిష్ణంరెడ్డిపల్లి గ్రామంలో వనభోజనోత్సవాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి అనంతరం ఏటా వనభోజనోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. శనివారం గ్రామస్థులు ఉదయం గ్రామ సమీపంలోని చింత వనంలోకి వెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆటపాటలతో గడిపారు. చెట్లకు ఊయలలు వేసుకొని... సందండి చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం గ్రామ దేవుడైనా నెట్టికంటి అంజనేయస్వామి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగిస్తూ... ఇళ్లకు చేరుకున్నారు.

నామినేషన్ వేసిన పరిటాల


పరిటాల ఘాట్ వద్ద నామినేషన్‌పై సంతకం చేస్తున్న పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 20: రాప్తాడు నియోజకవర్గ టీడీపీ అభ్యరిగా మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో కలిసి నామినేషన్ వేసేందుకు శనివారం బయలుదేరివెళ్లారు. ముందుగా వెంకటాపురంలో పరిటాల రవీంద్ర ఘాట్ వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘాట్ వద్దనే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. నామినేషన్ పత్రాలను ఘాట్ వద్ద ఉంచి పూజలు చేసిన అనంతరం యల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

25న మరోసారి నామినేషన్

రాప్తాడు : పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. రాప్తాడులో పరిటాల సునీత, శ్రీరామ్‌లు వేరువేరుగా నామినేషన్ వేశారు. ఒక్కొక్కరు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబుకు అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... శనివారం మంచి రోజు కావడంతో ఒక సెట్ నామినేషన్ వేశామని, ఈనెల 25న భారీ జన సందోహం నడుమ నామినేషన్ వేస్తామని తెలిపారు.

ఎడిఫై స్కూల్‌కు ప్రభుత్వం అనుమతి


మాట్లాడుతున్న కామేశ్వరి

అనంతపురం విద్య, ఏప్రిల్ 20: ఎడిఫై వరల్డ్ స్కూల్‌కు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ఆ స్కూల్ చైర్‌పర్సన్ కామేశ్వరి పేర్కొన్నారు. శనివారం రాంనగర్‌లోని వారి కార్యాలయంలో ఆమె మాట్లాడారు. అనంతపురంలో నాణ్యమైన విద్యను అందించాలన్న సదుద్దేశంతో ఈ స్కూల్‌ను ప్రారంభించామన్నారు. స్కూల్‌కు అనుమతి కోసం ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వానికి చలానా పే చేశామని, అయితే కొందరు అడ్డుకోడానికి ప్రయత్నాలు చేశారని ఆమె ఆరోపించారు. తాము అనంతపురంలోకి రాకుండా విశ్వప్రయత్నాలు చేసినా.... ఆఖరికి ధర్మం, న్యాయం గెలిచిందని, తమ స్కూల్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని చెప్పుకొచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రవీణ్, నవీన్, హెచ్‌ఆర్ ప్రశాంతి, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని రుద్రంపేట పంచాయతీ ఎంపీయూపీ స్కూల్ సమీపంలోని నాగల కట్ట వద్ద శివాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. శనివారం స్థానికుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి బృందం సభ్యులు బండి తిరుపాలు,


భూమిపూజలో పాల్గొన్న స్థానికులు

విజన్ ఉన్న నేత.. చంద్రబాబు

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి



గుమ్మేపల్లిలో చంద్రబాబు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బండారు శ్రావణిశ్రీ, గజమాలతో సన్మానిస్తున్న సర్పంచ్ లలితమ్మ, మహిళలు

శింగనమల ఏప్రిల్ 20: దేశంలోనే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడేని, రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే బాబే ముఖ్యమంత్రి కావాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో చంద్రబాబు జన్మదిన సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి శుభాంక్షలు తెలిపారు. అనంతరం గుమ్మేపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో సర్పంచుల వ్యవస్థను నాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని, నిధులు లేక పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేదని, కొందరు సర్పంచులు పంచాయతీ అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డేగల కృష్ణమూర్తి, లలితమ్మ, మారుతి నాయుడు, డేగల శ్రీనా ఆదినారాయణ, షాలిని విశాలాక్షి, పెద్దన్నచంద్ర, విజయ్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి : మండలంలోని కల్లుమడిలో వైసీపీకి చెందిన సుమారు 100 కుటుంబాలకు చెందిన వారు బండారు శ్రావణి సమక్షంలో టీడీపీలో చేశారు. వైసీపీ నాయకుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాల నివారణకు చర్యలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 20: నగరంలో రెండు రోజులుగా నెలకొంటున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాల నివారణకు చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఆమేరకు శనివారం మార్కెట్ యార్డు విద్యుత్ ఉపకేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పవర్ ట్రాన్స్‌ఫార్మన్ పనులను అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ మేఘరాజు, ఏడీ లక్ష్మినారాయణ తదితరులతో ఆయన పరిశీలించారు. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కారణంగా... వినియోగదారులు ఎయిర్ కండీషనర్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు వినియోగించడం వలన విద్యుత్ సరఫరా అయ్యే లైన్లు, ఉపకేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అనూహ్యమైన భారం పెరిగిందన్నారు. జేఎన్‌టీయూ, రుద్రంపేట, జీసస్‌నగర్, మార్కెట్ యార్డు పరిధిలోని ఉపకేంద్రాల పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తడం జరుగుతోందన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి రూ.2.5 కోట్లతో నిర్మాణంలో ఉన్న ఉప్పరపల్లి ఉపకేంద్రాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జేఎన్‌టీయూ ఉపకేంద్రంపై ఉన్నభారాన్ని ఉప్పరపల్లి ఉపకేంద్రానికి మార్పు చేశామన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ పరమైన సమస్యలు తగ్గుతాయన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ

అలాగే మార్కెట్ యార్డు ఉప కేంద్రంలో రూ.65 లక్షలతో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 8ఎంవీఏ సామర్థ్యానికి పెంచామన్నారు. దీనివలన ఉపకేంద్రం పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుంటుందన్నారు. అలాగే రూ.1.8 కోట్లతో రుద్రంపేట, జీసస్ నగర్, జేఎన్‌టీయూ ఉపకేంద్రాలోని 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాలను 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌గా పెంచే పనులు రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు.

హనుమ వాహనంపై రాములోరు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 : స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన శనివారం రాములవారు హనుమంత వాహనంపై ఊరేగారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో హనుమద్ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఉంచి.. పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై శ్రీ నృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి శిష్యబృందం స్వామివారికి నాట్యనీరాజనం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామ సుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మ ణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.


హనుమద్‌వాహనంపై స్వామి


నృత్యం చేస్తున్న కళాకారులు

చెత్త కుప్ప కాదు.. మరువవంక

ఆరు నెలలుగా పూడిక అలాగే..

అనంతపురం క్రైం : అది అనంతపురం నగరంలోని ప్రధాన మురికి కాలువైన మరువవంక. నగరంలోని 35 నుంచి 40శాతం కాలనీలకు సంబంధించి డ్రైనేజీ కాలువలు కలిసే వంక. కానీ ఆ కాలువ చాలా భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో పేరుకుపోయింది. పాత క్రిష్ణ థియేటర్ పక్కనే ఉన్న బ్రిడ్జి వద్ద ఈ కాలువను చూస్తే మరువవంక అనుకోరు. ఎందుకంటే అక్కడ చెట్లు మొలిచి, చుట్టూ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. కదిలే మురికినీరు చుక్క కూడా కనిపించదు. ఇలా నిర్లక్ష్యంతోనే వెడల్పుగా ఉన్న ఈ మరువవంక కుంచించుకుపోయింది. ఆరు నెలలుగా పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో కాలువంతా పిచ్చి మొక్కలతో మొదలై చెట్లుగా ఎదిగాయి. మరోవైపు అక్కడ వెదజల్లే దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. పాలకవర్గం, అధికారులు తమ కేమీ పట్టనట్లు వ్యవహరించడంతోనే ఈ దుస్థితి ఏర్పడింది. ఇది వరకు పూడికతీత పనుల్లో సైతం అదనంగా బిల్లులు పెట్టుకున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.


పాత క్రిష్ణ థియేటర్ సమీపంలోని మరువవంక దుస్థితి

బకాయి వేతనాలు చెల్లించండి

అనంతపురం క్లాక్‌టవర్: బకాయి వేతనాలు ఇవ్వాలని డ్వామా జేఏసీ అధ్యక్షుడు రామాంజి నేయులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక డ్వామా కార్యాలయంలో ఉపాధి హామీ పథకం డ్వామా జేఏసీ ఆధ్వర్యంలో పీడీ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. ఉపాధి పథకంలో 18 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ఎన్నడూలేనివిధంగా మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ భారమై రోడ్డున పడే దుస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. దీనికి డ్వామా పీడీ స్పందిస్తూ... పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా జేఏసీ నాయకులు లక్ష్మినారాయణ, సతీష్, రఘు, ప్రసాద్, ఆదినారాయణమ్మ, రఘు, తిమ్మప్ప, శివయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.


డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

వెంకటాంపల్లిలో టీడీపీ విస్తృత ప్రచారం


వెంకటంపల్లి లో మాట్లాడుతున్న ఆలం నరసా నాయుడు

నార్పల, ఏప్రిల్ 20: నార్పల మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఈ ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం ఆరాచకాలను తెలియజేస్తూ బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, నాయకులు పిట్టురంగారెడ్డి, వెంకటేశ్వర నాయుడు, ఎర్రినాగప్ప, రాఘవ నాయుడు, ఆదినరసింహ, ఆలం నాగార్జున నాయుడు, చంద్రబాబు, లక్ష్మీనాయుడు, జాఫర్, రాజన్న, నారాయణస్వామి, నాగేష్, కృష్ణుడు, వీసీ తిరుపాలు, టీ నారాయణస్వామి, వీ నాగేంద్ర, జే మహేష్, సీ తిరుపతయ్య, పీ ఆదినారాయణ, కుల్లాయప్ప, కొట్టం శ్రీరాములు, జి నల్లప్ప, నాగరాజు, కత్తిబ్రహ్మ, వలి, రఫి, దస్తగిరి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం


ధ్వంసమైన కారు అద్దం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 20: కనగానపల్లి మండలంలోని కోనాపురంలో గిరిశాల మంజునాథ్‌కు చెందిన కారు శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శుక్రవారం మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఆ సందర్భంగా గిరిశాల మంజునాథ్ తన కారును తమపొలం వద్ద వదిలేసి ప్రచారంలో పాల్గొన్నారు. దీన్ని జీర్ణించుకోలేని గుర్తుతెలియని వ్యక్తులు ఆ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని శనివారం గుర్తించిన మంజునాథ్ కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనే నెపంతోనే వైసీపీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడినట్లు బాధితుడుతో పాటు టీడీపీ నాయకులు ఆరోపించారు.

ప్రకాష్‌రెడ్డీ.. బీసీలే నిన్ను ఓడిస్తారు

రాప్తాడు, ఏప్రిల్ 20: ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని బీసీలే ఓడిస్తారని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప విమర్శించారు. కనగానపల్లిలో బీసీలు టీడీపీలోకి చేరికపై ప్రకాష్‌రెడ్డి చెత్తనంతా పరిటాల సునీత ఊడ్చుకెళ్లిందని వ్యాఖ్యానించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం ఓట్లు వేసిన వారు ఇప్పుడు చెత్తలా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. బీసీలను ఎన్నికల సమయంలో వాడుకుని వారిని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తోపు గెలుపు కోసం కృషి చేసిన బీసీలే.. ఈ ఎన్నికల్లో ఆయన్ను చిత్తుగా ఓడిస్తారని తెలిపారు. లక్ష ఎకరాలకు సాగు నీరు ఇస్తానని ప్రగల్భాలు పలికి... ఐదేళ్లు గడిచినా ఒక్క ఎకరాకైనా నీరిచ్చావా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, జయరాముడు, కిష్టా, రామకృష్ణా, స్వర్ణక్క పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

ధర్మవరం రూరల్: కనగానపల్లి మండలంలోని మామి ళ్లపల్లి ఎస్సీ కాలనీలో ఓ ఇంటిలో శుక్రవారం అర్ధరాత్రి దొంగతనం చేసేందుకు యత్నించిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి పోలీసులకు అప్పగించారు. గ్రామం లోని ఎస్సీ కాలనీలోకి ద్విచక్రవా హనంలో వచ్చిన ఇద్దరు దుండుగులు ఓ ఇంటిలోకి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించారు. స్థానికులు గమనించి ఓ దుండుగున్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతన్ని ద్విచక్రవాహనంతో పాటు కనగానపల్లి పోలీసులకు అప్పగించారు. మరో దుండుగుడు పారిపోయాడు. ఈ విషయంపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా... దొంగతనం వచ్చినట్లు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, అనుమానస్పదంగా ఓ వ్యక్తి తిరుగు తున్నాడని స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే తమ సిబ్బందిని పంపించి అతన్ని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని అన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో కేసులు లేకుండా చేశా

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం


లారీ ట్రాన్స్‌పోర్టు సంఘ సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 20: తాను ప్రజా ప్రతినిధిగా ఉన్న పదేళ్లు ఆలూరు నియోజకవర్గంలో ఎవరిపైనా అక్రమ కేసులు బనాయించడం, స్థలాలు లాక్కోలేదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం ఉదయం పాతగుంతకల్లులో లారీ ఓనర్ల సంఘం నాయకులు రమేశ్, మల్లికార్జున, సంఘ సభ్యులు జయరాం సమక్షంలో టీడీపీలోకి చేరారు. తమ సంఘ కార్యాలయ స్థలాన్ని వైసీపీ నాయకులు లాక్కున్నారని, లారీలను బలవంతంగా నిలిపివేయించి ఇబ్బందులు పెట్టారని జయరాంకు వారు ఫిర్యాదు చేశారు. జయరాం మాట్లాడుతూ లారీ ఓనర్ల సంఘానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు తలారి మస్తానప్ప, కోడి శీనా, బండారు నాగేశ్ పాల్గొన్నారు.

టీడీపీలో మైనార్టీల చేరిక: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం వైసీపీకి చెందిన పలువురు ముస్లిం మైనార్టీలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం ఉదయం మెయిన్ బజార్‌లోని టెంకాయల వ్యాపారులు యూసుఫ్, హారున్, తదితరులు టీడీపీలో చేరారు. కురుబ కుల ప్రముఖుడైన పూజారి బస్సప్ప, శివప్ప, తదితరులను కలసి ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. టీడీపీ లీగల్ సెల్ నాయకుడు హేమాద్రి ఆధ్వర్యంలో పలువురు గుంతకల్లు బార్ అసోసియేషన్ నాయకులు ఎన్‌ఎల్ ప్రసాద్, గురుప్రసాద్, రాజశేఖర్, శ్యామల, గంగావతి, రామ్, కే చంద్రశేఖర్, వరప్రసాద్, పీ చంద్రశేఖర్‌కు జయరాం పార్టీ కండువాలను వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

● పట్టణంలోని హనుమేశ్ నగర్‌లో గుమ్మనూరు జయరాం సోదరులు శ్రీనివాసులు, నారాయణ స్వామి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కేసీ హరి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుజరీ మహమ్మద్ ఖాజా పాల్గొన్నారు.

● **గుత్తిరూరల్:** మండలంలోని బసినేపల్లి గ్రామంలో శనివారం వైసీపీ నుంచి టీడీపీలోకి గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ ఆధ్వర్యంలో చేరారు. గ్రామానికి చెందిన రామంజునేయులు, రంగ, సురేష్, నారాయణ, కాశీం, హుసేన్, నాగర్జునతో పాటు మరో 25 కుటుంబాల వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

● గుత్తి: టీడీపీ అధికారంలోకి రాగానే కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని జయరాం తనయుడు ఈశ్వర్, సోదరుడు నారాయణ పేర్కొన్నారు. గుత్తిఆర్ఎస్‌లోని 7వ వార్డులో ఎస్సీ కాలనీలో పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

● పట్టణంలోని గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో శనివారం కార్మికుల టీ విరామ సమయంలో జయరాం సోదరుడు నారాయణ కార్మికులతో ములాఖత్ అయ్యారు. టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి


పామిడిలో మహిళకు కరపత్రం అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి: తెలుగుదేశంపార్టీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... టీడీపీ హయాంలోనే డ్వాక్రా సంఘాలు స్థాపించి మహిళల స్వయం ఉపాధికి పునాదులు వేశారన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహిస్తున్న కొత్తపల్లి సోదరులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 20: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో కొత్తపల్లి తిమ్మరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పాండురంగస్వామి ఆలయంలో పూజలు జరిపించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, మహేంద్ర, బాబురావు, అరుణ్‌కుమార్, శీన, కొత్తపల్లి రవి, కొత్తపల్లి సూరి, పయ్యావుల నాగరాజు, కురుబ తిప్పయ్య, బళ్లారి బాషా, కుమ్మరి వన్నేశ, ఎల్ఐసీ శీన, కురుబ శేఖర్, ప్రశాంత్‌గౌడ్, హనుమంత, చాకలి శేఖర్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ


కేపీకుంట చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

గుమ్మఘట్ట, ఏప్రిల్ 20: మండలంలోని కర్ణాటక సరిహద్దు కేపీ కుంట, కేపీదొడ్డి చెక్‌పోస్టులను ఎస్పీ అమిత్ బర్దర్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, గుమ్మఘట్ట ఎస్ఐ వెంకటేశ్వరులతో కలిసి ఆయన గుమ్మఘట్ట స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు, మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీ పెంచాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పాటు ఇతర మార్గాల ద్వారా ఆంధ్రాలోకి ప్రవేశించే మార్గాలను సైతం నిఘా వేసి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట: డీఎస్పీ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 20: ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటక నుంచి ఆంధ్రాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. వాహనాల నెంబర్లను ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలన్నారు. రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంటల రుణాలు రెన్యువల్ చేయాలి


బ్యాంకు మేనేజర్‌కు మనవిపత్రం ఇస్తున్న రైతులు

కుందుర్పి, ఏప్రిల్ 20: బ్యాంకుల్లో రైతుల పంటల రుణాలు వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని పలువురు రైతులు శనివారం యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. కుందుర్పి మండల మలయనూరు పంచాయతీకి చెందిన రైతులు పంటలు పండక వడ్డీ కూడా కట్టలేని స్థితిలో ఉన్నామని బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి వడ్డీ, అసలు లేకుండా రుణాలను రెన్యువల్ చేసే విధంగా చూడాలని కోరారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. రైతులు వీరాంజనేయులు, చంద్రరాజు, పూజారప్ప, సంజీవప్ప పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 20: స్థానిక పెన్షనర్ల భవనంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిరాం ఐ ఆసుపత్రి వైద్యులు శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9390053731 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కళ్యాణదుర్గం అభివృద్ధే అజెండా

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని


మహిళలతో కలిసి కట్ చేస్తున్న అమిలినేని

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 20: కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే మొదటి అజెండా అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం పట్టణంలోని 18వ వార్డు కోట వీధి, 19వ వార్డు రాచప్ప కుంట, 20వ వార్డు మేడా వీధిలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా కాలనీల్లో అమిలినేనికి పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్ షో, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క ప్రాంతం కూడా అభివృద్ధికి నోచుకోలేదంటే వైసీపీ పాలన ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమని అన్నారు. ఆ దిశగా మనమందరం టీడీపీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ప్రణాళిక వేసుకుని ఆ దిశగా ముందుకు సాగుతున్నామని, రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తామని అన్నారు. ఒక్క చాన్స్ ఇచ్చి చూడండి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో కళ్లకు కట్టినట్లు చూపిస్తానన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా కళ్యాణదుర్గంలో పరిశ్రమలు తెచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తానని హామీ ఇచ్చారు. మనందరి ధ్యేయం టీడీపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టీడీపీ గెలిస్తేనే పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. డ్రైనేజీలు నిర్మించి ప్రజల సమస్యలు తీరుస్తామన్నారు. మే 13న ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానుల సమక్షంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు.

దురదకుంటలో వైసీపీకి షాక్: కళ్యాణదుర్గం మండల దురదకుంట గ్రామానికి చెందిన 61 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వీరందరికీ అమిలినేని సురేంద్రబాబు, దురదకుంట సర్పంచ్ భర్త గరికపాటి సురేష్ టీడీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని వారు తెలిపారు. అలాగే శెట్టూరు మండలం యాటకల్లు గ్రామంలో వైసీపీకి చెందిన పది కుటుంబాలు టీడీపీలోకి చేరారు.


టీడీపీలో చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు

ఎద్దులబండి ఎక్కిరైతుగా మారిన అమిలినేని


మల్లిపల్లిలో ఎద్దులబండి నడుపుతున్న అమిలినేని సురేంద్రబాబు

మల్లిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి శనివారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఎద్దులబండి పైకి ఎక్కి అమిలినేని సురేంద్రబాబు రైతుగా మారారు. రోడ్‌షోలో ఎద్దులబండి నడుపుతూ అందరినీ ఆకట్టుకున్నారు. రైతులకు టీడీపీ ప్రభుత్వమే పెద్దపీట వేస్తుందని ఆ దిశగా ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

రోడ్‌షోకు కరెంటును ఆఫ్ చేయించిన వైసీపీ సర్పంచ్

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం మండలం వర్లి గ్రామంలో శనివారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. రోడ్‌షోలో భారీగా జనం తరలివచ్చారు. ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలోనే గ్రామంలో కరెంటు కోత విధించారు. దీంతో వెంటనే అమిలినేని సురేంద్రబాబు ప్రసంగం వింటున్న కార్యకర్తలు, అభిమానులు, నాయకులు వారి వద్ద వున్న సెల్‌ఫోన్లలో టార్చ్‌లైట్లను వేశారు. ఆ వెలుతురులోనే ఆయన ప్రసంగించారు. ఆయనకు వర్లి గ్రామంలో ప్రజాదరణచూసి ఓర్వలేక ఆ గ్రామ వైసీపీ మద్దతు దారుడైన సర్పంచే కరెంటు కోత విధించినట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. సురేంద్రబాబుకు అడుగడుగునా వైసీపీ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు ఎంతచేసినా చివరకు గెలిచేది సురేంద్రబాబే అన్నారు.

ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు: జేసీపీఆర్


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, ఏప్రిల్ 20: పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో జేసీపీఆర్ మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. విభేదాలు పక్కనపెట్టి పార్టీ గెలుపుకు శ్రమించాలన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు సూర్యనారాయణరెడ్డి, గంగరాజుయాదవ్, హరినాథ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, నాగరాజు, చిరంజీవులు, శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

తాడిపత్రిటౌన్: స్థానిక నివాసంలో యాడికి మండలంలోని రాయల చెరువు, దైవాలమడుగు గ్రామాలకు చెందిన 35 కుటుంబాల వారు శనివారం ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, రవికుమార్‌రెడ్డి, పరిమి చరణ్, చలమారెడ్డి, సుధాకర్‌నాయుడు, శాంతారెడ్డి పాల్గొన్నారు.

● పట్టణంలోని 13వవార్డు వైసీపీ కౌన్సిలర్ రంగనాథరెడ్డి 200మందితో కలిసి శనివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సుంకులమ్మపాలెంలోని నివాసంలో పార్టీలో చేరినవారికి జేసీ ప్రభాకర్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎస్వీ రవీంద్రారెడ్డి, ఎంఎ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ చల్లా రఘు, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని రాంపురంలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు శనివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన రంగస్వామి, మహేశ్వర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, శేషారెడ్డి, రవితోపాటు మరికొంతమందికి జేసీ ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.


తాడిపత్రిలో పార్టీలో చేరిన వారితో జేసీ అస్మిత్‌రెడ్డి

ముగ్గురు దొంగల అరెస్టు

గుంతకల్లు, ఏప్రిల్ 20: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను గుత్తి జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకోగా, గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి అరెస్టు చూపారు. యూపీకి చెందిన అభయ్ రాజా సింగ్, శివం చౌహాన్, హర్యానాకు చెందిన సన్నీ మల్హోత్రా అనే నిందితులను గుత్తి పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 10 గ్రాముల బంగారు చైను, 12 గ్రాముల బంగారు కట్ చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాత్రి సమయాల్లో కారులో బయలుదేరి, తాము ముందుగా ఎంచుకున్న రైల్వే స్టేషన్లలో ఉన్న రైళ్లలోకి చేరుకుని ప్రయాణికుల బ్యాగులు, బంగారు చైన్లు తస్కరించేవారని జీఆర్పీ సీఐ నగేశ్ బాబు తెలిపారు. గుత్తి జీఆర్పీ స్టేషన్‌లో నమోదైన చోరీ కేసులపై రైళ్లలో తనిఖీ చేస్తుండగా ఈ ముగ్గురు నిందితులు తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీచేయగా వారి వద్ద 22 తులాల రూ.1.10 లక్షల విలువైన రెండు బంగారు చైన్లు లభించాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన తనను, ఎస్ఐ ఏ నాగప్ప, ఆర్పీఎఫ్ సీఐ అనురాగ్ కుమార్, సిబ్బంది కే గోపాల్, శ్రీనివాస కుమార్, సాయి సర్వేశ్వర రావు, నాగరాజు, వాసు, శేక్షావలిని ఎస్పీ చౌడేశ్వరి ప్రశంసించారని తెలిపారు.

కేబుల్ వైర్ చోరీ

గుత్తి, ఏప్రిల్ 20: మండలంలోని బసినేపల్లి తండాకు చెందిన గోవింద్‌నాయక్ వ్యవసాయ పొలంలో విద్యుత్ కేబుల్ చోరీకి గురైనట్లు బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ మోటరుకు ఉన్న 600 మీటర్ల విద్యుత్ వైర్‌ను కట్ చేసి చోరీ చేశారన్నారు. రూ.20వేలు నష్టం వాటిల్లిందన్నారు. ఇదివరకే మూడు సార్లు వైర్ చోరీ చేశారన్నారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 20: మున్సిపాల్టీ పరిధిలోని ఒంటిమిద్ది సమీపంలో ఆటో ఢీకొని మహిళకు గాయాలు అయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒంటిమిద్ది గ్రామంలో రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు నుండి కళ్యాణదుర్గం వైపు వస్తున్న ఆటో అతివేగంతో వస్తూ ఢీకొనడంతో తల, నడుము భాగంలో గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల సంక్షేమాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి

రాయదుర్గం, ఏప్రిల్ 20: ఎన్నికల్లో పాత్రికేయుల సంక్షేమం గురించి మేనిఫెస్టోల్లో చేర్చాలని శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ఆ సంఘం నాయకులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఏపీయూడబ్ల్యుజే జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మహ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో చంద్రబాబును కలిశారు. గతంలో అమలు చేసి నిలిపివేసిన జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. ఏపీయూడబ్ల్యుజే రాయదుర్గం అధ్యక్షుడు కమలాక్షుడు, సభ్యులు గోవర్ధన్, మహేష్ ఉన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

కుందుర్పి, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కెనరా బ్యాంకు వారు రూ.40 వేలు విలువ చేసే ఫ్యాన్లను శనివారం వితరణ చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం కెనరా బ్యాంకు సిబ్బంది స్పందించి ఫ్యాన్లు అందించడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప అన్నారు. బ్యాంకు సిబ్బంది వేణుగోపాల్ రెడ్డి, మనోజ్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆసుపత్రి స్థలం విక్రయంపై అధికారుల ఆరా

యాడికి, ఏప్రిల్ 20: యాడికిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా గతంలో ఉన్న పశువుల ఆసుపత్రి స్థలం విక్రయంపై శనివారం ఈఓపీఆర్డీ వెంకటేష్, మండల సర్వేయర్ సుంకన్న ఆరాతీశారు. సర్వేనెంబరు 519సిలో గతంలో పశువుల ఆసుపత్రి స్థలం ఉండేదని, దానిని విక్రయించారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు అందిన నేపథ్యంలో శనివారం అధికారులు ఆరాతీశారు. వారు మాట్లాడుతూ ఫిర్యాదు వచ్చిన స్థలంలో శిథిలమైన భవనం ఉందని, అక్కడ పశువుల ఆసుపత్రి నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించిన అనంతరం స్థలం ప్రభుత్వానిదా లేక ప్రైవేట్ వ్యక్తులదా అనేది నిర్ధారిస్తామన్నారు. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు చేపడతామని వారు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో వీడ్కోలు సభ

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 20: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరపు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు వీడ్కోల సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పరిషాఫిర్దోష్ పాల్గొని మాట్లాడారు. మూడు సంవత్సరాల పాటు కళాశాలలో చదువుకొని చక్కని విజ్ఞానంతో వెళుతున్న మీకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో మాజీ ఐఏఎస్ అధికారి


స్వామివారిని దర్శించుకుంటున్న లక్ష్మీనారాయణ

ఉరవకొండ, ఏప్రిల్ 20: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ శనివారం దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆయన పేరిట ఆలయంలో ప్రత్యే పూజలు చేశారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైసీపీ ప్రచారంలో వలంటీరు


ప్రచారంలో పాల్గొన్న వలంటీరు గోపాల్ (వృత్తంలో)

విడపనకల్లు, ఏప్రిల్ 20: మండల కేంద్రంలో వైసీపీకి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని గ్రామ నాయకులు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి, ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు. వైసీపీ నాయకుల వెంట గ్రామ వలంటీరు గోపాల్ ప్రచారం చేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బెళుగుప్ప, ఏప్రిల్ 20: మండలంలోని హనిమిరెడ్డిపల్లిలో మండల ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందిన గణేష్‌ను అభినందిస్తూ ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్ పీరా రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతి కింద నగదును అందజేశారు. ఎంఈవో మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అభివృద్ధి చేయలేని అసమర్థుడు విశ్వేశ్వరరెడ్డి

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్


పయ్యావుల కేశవ్‌కు హారతి ఇస్తున్న మహిళ

కూడేరు, ఏప్రిల్ 20: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఒక్క చాన్స్ పేరుతో జగన్ ప్రజలను మోసం చేస్తే, ఉరవకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని అసమర్థుడు విశ్వేశ్వరరెడ్డి అని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హాజరయ్యారు. ముద్దలాపురం గ్రామంలో పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనైనా చేశావా, హంద్రీ నీవా కాలువలో నీరు పోతున్నా చెరువులకు నీరు ఇవ్వలేదని, చివరికి తాగడానికి నీరు ఇవ్వలేని చేతకాని నాయకుడు విశ్వేశ్వరరెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పేరు చెరువుకు నీరు ఇవ్వకుండా మట్టి తవ్వుకొని కోట్లు దోచేశారని, దేవుడి పేరుతో మట్టి దందా సాగిందని, అందుకే చెరువుకు నీరు ఇవ్వలేదని ఆరోపించారు. నియోజకవర్గంలో టీడీపీ పాలనలో సామూహిక డ్రిప్ పనులు 75శాతం చేస్తే, ఈ ప్రభుత్వం వాటిని నిలిపివేయడంతో గుట్టలు గుట్టలుగా డ్రిప్ పరికరాలు ఉండిపోయాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో మొదటి కూలీని అవుతానని, అభివృద్ధి చేయలేని విశ్వేశ్వర రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశాడని, త్వరలో ఇంటికి సాగనంపుతామన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుండటంతో చరమగీతం పాడటానికే కూటమి జత కట్టిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కడదరకుంట, కరుట్లపల్లి తదిరత గ్రామాల్లో రోడ్డుషో నిర్వహించారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

నేమకల్లు ఆంజనేయుడికి విశేషపూజలు


అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 20: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి చైత్రమాసం తొలి శనివారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు స్వామివారికి పూజలు చేశారు. వేకువజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర నిర్వహించి వెండికవచ అలంకరణ, పుష్పాలంకరణ, నైవేద్యం సమర్పించిన అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి సిబ్బంది ఓబున్న పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని అప్పలాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

నరసింహస్వామి అలంకరణలో శ్రీరాముడు



తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 20: పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాముడు నరసింహస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

నెమలి వాహనంపై సంగమేశ్వరుడు

కూడేరు, ఏప్రిల్ 20: ప్రసిద్ధి చెందిన జోడులింగాల సంగమేశ్వర స్వామి శనివారం వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలి వాహనంపై స్వామి వారు విహరించారు. వైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన నెమలి వాహనాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో అర్చకులు రుద్రాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి సంగమ్మ, సంగప్పలను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరిచంఆరు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా కైలాస వాహనోత్సవం


కైలాస వాహనంలో ఊరేగిన స్వామివారు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 20: పట్టణంలోని జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా శనివారం కైలాస వాహనంలో స్వామివారిని ఊరేగింపు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠించి నేసేపేట, బళ్లారి బస్టాండ్, వినాయకసర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు ఊరేగింపు సాగింది. మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవంలో భాగంగా బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి

యాడికి, ఏప్రిల్ 20: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థు ల గెలుపుతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు అన్నారు. శనివారం యాడికిలో టీడీపీ నాయకు లు విస్తృత ప్రచారం నిర్వహించారు. మహిళా నాయకురాలు అనిత, ఈశ్వరమ్మ, అరుణ, నాయకులు నీలకంఠ, రాజశేఖర్‌నాయుడు, నరసింహ, రాముడు, లక్ష్మణ్, చంద్రశేఖర్‌రెడ్డి, మధురాజు, రమేష్, నారాయణ స్వామి, హాజీబాషా పాల్గొన్నారు.

ఎంపీ తరపునన ప్రచారం

గుంతకల్లు: టీడీపీ అనంతపురం పార్లమెంటు అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తరపున పట్టణానికి చెందిన ముష్టూరు తిమ్మప్ప మండలంలోని దోనిముక్కల, వైటీ చెరువు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. గ్రామీణులను కలసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా, జయరాంలకు ఓటువేసి గెలిపించాని ఓటర్లను అభ్యర్థించారు.

చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 20: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.35 వేలు, కనిష్టంగా రూ.15 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 691 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.